ఈనాడు కామారెడ్డి
మంగళవారం అక్టోబరు 8, 2024

నిబద్ధతతో పనిచేసిన వారికే పదవులు

గాంధారి, న్యూస్‌టుడే: నిబద్ధతతో పనిచేసిన వారికే పదవులు దక్కుతాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ పేర్కొన్నారు. గాంధారి ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం సోమవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో జరిగిన కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ షెట్కార్ మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్ల పాలనతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, అయినా ఏ మాత్రం వెనుకంజ వేయకుండా రైతులందరికీ రుణమాఫీ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఛైర్మన్‌గా బండారి పరమేష్, వైస్‌ఛైర్మన్‌గా లక్ష్మణ్‌తో పాటు 11 మంది డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. ఇందులో ఒక డైరెక్టర్‌గా ఎంపికైన మాజీ ఎంపీపీ దశరథ్‌నాయక్ సభకు హాజరైనా ప్రమాణస్వీకారం చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. తొలుత ప్రధాన చౌరస్తా వద్ద గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. నేరల్ తండాలో సొసైటీ ఆధ్వర్యంలో రూ.14 లక్షల నిధులతో 150 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్, సొసైటీ ఛైర్మన్ సాయికుమార్, మండలాధ్యక్షుడు మోహన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏఎంసీ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్, లింగాగౌడ్, సంపత్‌గౌడ్, మాజీ సర్పంచి సంజీవ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు తూర్పు రాజులు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



గాంధారి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్

వచ్చింది వచ్చినట్లుగా..

నిజాంసాగర్ : నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరడంతో నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నట్లు జలవనరులశాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. సోమవారం సాగర్‌లోకి 18,700 క్యూసెక్కుల వరద రావడంతో నాలుగు గేట్లను ఎత్తి 17,000 క్యూసెక్కులు మంజీరాలోకి, 1400 క్యూసెక్కులు నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల చేసినట్లు చెప్పారు.

పరిశ్రమలు తరలొచ్చేనా..

స్థాపన, ఉపాధి కల్పనలో జిల్లా వెనుకంజ

ఈనాడు, కామారెడ్డి

పరిశ్రమలు యువతకు ఉపాధి కల్పించి ప్రగతి, అభివృద్ధికి సూచికగా ఉంటాయి. తలసరి ఆదాయాన్ని పెంచుతుంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఆశించిన స్థాయిలో పరిశ్రమల స్థాపన జరగలేదు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు హయాంలోనైనా పరిశ్రమల స్థాపన జరిగి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశించిన జిల్లా ప్రజలకు నిరాశే మిగులుతోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో భారీ పరిశ్రమలు స్థాపించేందుకు 24 సంస్థలు ముందుకు వచ్చాయి. కానీ రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న కామారెడ్డిలో పరిశ్రమలు స్థాపించేందుకు ఏ ఒక్క సంస్థ ముందుకు రాకపోవడం గమనార్హం.

ఇథనాల్ ఉత్పత్తికి అవకాశాలు..

జిల్లాలోని రెండు చక్కెర కర్మాగారాల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇథనాల్ కర్మాగారాల నుంచి ఏటా 45 వేల లీటర్లు ఉత్పత్తి చేస్తున్నారు. వాతావరణం, ఇతరత్రా పరిస్థితుల కారణంగా జిల్లా రైతులు దొడ్డు రకం ధాన్యం సాగుచేసేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో 3,15,457 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా.. 98,627 ఎకరాల్లో మాత్రమే సన్నాలు పండిస్తున్నారు. ఇక వచ్చే సీజన్‌లోనూ దొడ్డురకం సాగుకే సన్నాహాలు చేసుకుంటున్నారు. దొడ్డురకం వడ్లు మిల్లింగ్ చేస్తే అవుటర్న్ రావడం లేదని మిల్లర్లు కోతలు పెడుతుండడంతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. తరుగుతోపాటు దొడ్డురకం ధాన్యానికి బహిరంగ విపణిలో డిమాండ్ రావాలంటే నూకల నుంచి ఇథనాల్ ఉత్పత్తి మంచి ప్రత్యామ్నాయమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ పరిశ్రమలు స్థాపిస్తే రైతులు, నిరుద్యోగ యువతకు ప్రయోజనం చేకూరనుంది.

ప్రతిపాదనలతోనే సరి..

జిల్లాలో ప్రైవేటు చక్కెర కర్మాగారాలు, ఫార్మా, బీడీల తయారీ, సోలార్ విద్యుదుత్పత్తి కంపెనీలు తప్ప నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పెద్ద పరిశ్రమలు లేవు. ఫలితంగా తలసరి ఆదాయంతో పాటు స్థూల ఉత్పత్తిలో జిల్లా వెనుకబడి ఉంది. తలసరి ఆదాయంలో జిల్లా రాష్ట్రంలో 26వ స్థానంలో ఉందంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



జిల్లా వివరాలు ఇలా..

పరిశ్రమలు	యూనిట్లు	పెట్టుబడి (రూ. కోట్లలో)	ఉపాధి పొందిన వారు
భారీ, మధ్య తరహా	22	1928.59	2,397
చిన్న, సూక్ష్మ తరహా	1383	930.00	7,555

వెనక్కేనా..?

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తోళ్ల పరిశ్రమ ఏర్పాటుకు చాలా ఏళ్ల నుంచి ప్రతిపాదన ఉంది. దీనిని ఏర్పాటు చేస్తే వందలాది మందికి ఉపాధి లభిస్తుంది. గతంలో రూ.270 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సమర్పించారు. 57 ఎకరాల్లో పెట్టనున్నట్లు వెల్లడించారు. కానీ కేంద్రం నుంచి నిధులు రాకపోవడంతో ముందడుగు పడలేదు.

★ ఆహార పరిశ్రమల స్థాపనకు జిల్లాలో రెండు సెజ్‌లు ఏర్పాటు చేసినప్పటికీ పెద్దగా ప్రయోజనం లేకుండా పోతోంది. రెండేళ్ల క్రితం సదాశివనగర్ మండలం లింగంపల్లి శివారులోని ఆహార శుద్ధి పరిశ్రమల పార్కు ప్రాంతంలో రూ.254 కోట్లతో జనపనార సంచుల కర్మాగారం ఏర్పాటు చేసేందుకు కాళేశ్వరం అగ్రిటెక్ సంస్థ ముందుకొచ్చింది. రాయితీలు, ప్రోత్సాహకాల కల్పనపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో ప్రతిపాదన దశలోనే ఉంది.

★ అపరాల సాగులో జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలు రాష్ట్రంలోనే ప్రసిద్ధి. ఈ ప్రాంతాల్లో సోయా, పప్పు దినుసుల ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నప్పటికీ అడుగులు ముందుకు పడడం లేదు. ప్రజాప్రతినిధులు శ్రమిస్తేనే పరిశ్రమల యోగం కలుగుతుంది.

తప్పుల తడక.. ప్రజల తికమక

అధికారులు మారినా.. పాత వివరాలతో జిల్లా వెబ్‌సైట్

న్యూస్‌టుడే, జుక్కల్

పౌరులకు ఏ సమాచారం కావాలన్నా.. వెంటనే చరవాణి తీసి గూగుల్‌లో వెతకడమే. వెబ్‌సైట్‌లో దూరిపోవడమే. అందులోని సమాచారం ఆధారంతో పనులు చక్కదిద్దుకోవడమే. దీన్ని దృష్టిలో ఉంచుకొనే కామారెడ్డి జిల్లా వెబ్‌సైట్ kamareddy.telangana.gov.inలో సమస్త సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. కాలానుగుణంగా నవీకరించకపోవడంతో తప్పుల వివరాలతో అధికార యంత్రాంగం అబాసుపాలవుతోంది. వెబ్‌సైట్‌లోని డైరెక్టరీ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే అన్ని శాఖల అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు కనిపిస్తాయి. ఇందులో అనేక మంది అధికారులు మారినా.. వారి పేర్లు మార్చలేదు. జిల్లా వ్యవసాయాధికారి, వైద్యశాఖాధికారి, విద్యుత్తుశాఖాధికారి ఇలా ఎంతో మంది అధికారుల పేర్లు పాతవే.



కామారెడ్డి జిల్లా వెబ్‌సైట్‌లో సవరించని అధికార్ల పేర్లు, హోదాలు

నవీకరణకు నోచుకోలే..

వ్యవసాయశాఖ విభాగంలో 2019-20 సంవత్సరానికి చెందిన ఖరీఫ్, రబీ పంటల సాగు.. విస్తీర్ణం వివరాలు నమోదై ఉన్నాయి. నాలుగేళ్లుగా వివరాలు నవీకరించలేదు. ఇక ఆసరా పింఛన్ కాస్తా చేయూతలా మారింది. దివ్యాంగులకు రూ.4016 పింఛన్ అందజేస్తున్నా.. వెబ్‌సైట్‌లో మాత్రం రూ.3016 అందజేస్తున్నట్లు వివరాలున్నాయి.

మండల స్థాయిలో మరీ దారుణం..

మండలస్థాయి అధికారుల పేజీ మరీ దారుణంగా మారింది. ఇందులో ఎంపీడీవో, ఎంపీవో, ఎంఈవో లాంటి అధికారుల పేర్లు, చరవాణి నంబర్లు ఉన్నాయి. ఓ అధికారి మృతి చెందినా.. ఆయన పేరు, నంబరు వెబ్‌సైట్‌లో ఉండడం గమనార్హం. ఎంపీడీవో పేజీల్లో అధికారులంతా మారిపోయారు. ఎంపీవోలు బదిలీ అయ్యారు. కొత్త ఎంఈవోలు విధుల్లో చేరినా.. పాత అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు నమోదై ఉన్నాయి. వీటన్నింటిని తక్షణమే మార్చాల్సిన అవసరం ఉంది.

ఆ ఇద్దరి పేర్లే మారుస్తున్నారు..

జిల్లా కలెక్టర్, ఎస్పీ మారినప్పుడు మాత్రమే వెబ్‌సైట్‌లో మార్పులు చేస్తున్నారు. మిగిలిన అంశాల మార్పు చేర్పుల్లో నిర్లిప్తత కనిపిస్తోంది. కలెక్టర్ గారు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పౌరులు విన్నవిస్తున్నారు. సమస్యను 'న్యూస్‌టుడే' జిల్లా పరిపాలనాధికారి సయీద్ అహ్మద్ మస్రూర్ దృష్టికి తీసుకువెళ్లగా... ఈడీ విభాగం దృష్టికి తీసుకువెళ్లి సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఇంటింటా సర్వే పూర్తి..

ఈనాడు, కామారెడ్డి

ప్రతి కుటుంబానికి యూనిక్ నంబర్‌తో స్మార్ట్ కార్డు ఇవ్వడానికి ప్రభుత్వం చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే పూర్తయింది. ప్రయోగాత్మక సర్వేకు జిల్లాలోని ఐదు గ్రామాలు, మూడు వార్డులను ఎంపిక చేసిన విషయం విదితమే. నిర్దేశిత గడువుకు ఒక రోజు ముందుగానే ఇంటింటి సర్వే పూర్తిచేసిన యంత్రాంగం.. ప్రొఫార్మాలో సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే పని ప్రారంభించారు. రెండు రోజుల్లో కంప్యూటీకరణ పనులు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దశల వారీగా అన్ని గ్రామాలు, వార్డుల్లో సర్వే చేసేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

ప్రభుత్వ వివరాల ఆధారంగా..

ఇంటింటి సర్వేలో కుటుంబాన్ని గుర్తించేందుకు ప్రభుత్వం అందించిన డేటానే ప్రామాణికంగా తీసుకున్నారు. నిర్దేశిత సమాచారంలోని వివరాలు వాస్తవమా కాదా అని నిర్ధారించుకొని వాటిని ఫారం-1లో నమోదు చేశారు. కుటుంబ సభ్యుల పేర్ల వివరాల్లో తప్పులుంటే సరిచేసి నమోదు చేసుకున్నారు. కుటుంబం అంగీకరిస్తే చిత్రం తీసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారంలో కొన్ని కుటుంబాలకు సంబంధించిన వివరాలు లేకుంటే ఫారం-2లో నమోదు చేశారు.

ఆన్‌లైన్ నమోదు ప్రారంభం



సర్వేలో కుటుంబ వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

ఎంపీడీవోల ఆధ్వర్యంలో..

సర్వేలో తప్పిదాలకు అవకాశం ఇవ్వొద్దనే ఉద్దేశంతో ఎంపీడీవోల ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల బృందాలను ఏర్పాటు చేసి సర్వేను పూర్తి చేసింది. ఆన్‌లైన్‌లో సైతం తప్పిదాలకు తావులేకుండా ఉండేలా డేటా ఎంట్రీలో అనుభవమున్న ఆపరేటర్ల సేవలను వినియోగించుకుంటున్నారు.

కుటుంబ యజమానిగా అతివ

సర్వేలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబ యజమానిగా మహిళ పేరును నమోదు చేశారు. ఆమెతో కుటుంబ సభ్యులకు ఉన్న బంధుత్వాన్ని పొందుపర్చారు. కుటుంబ సభ్యుల ఆధార్, చరవాణి నంబర్లు, పుట్టిన తేదీలు నమోదు చేసుకున్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా దామోదర్‌రెడ్డి



కామారెడ్డి పట్టణం: పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కామారెడ్డికి చెందిన పుల్లం దామోదర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

నిధుల పంపకాల్లో అసమానతలు..!

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

ప్రభుత్వం త్వరలో పంచాయతీల ఎన్నికలు నిర్వహిస్తుందనే ప్రచారంతో జిల్లాలో మళ్లీ ప్రత్యేక పంచాయతీల డిమాండ్లు వినిపిస్తున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం ఆరేళ్ల కిందట గత ప్రభుత్వం జిల్లాలో 208 కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసింది. దీంతో జిల్లాలోని పంచాయతీల సంఖ్య 526కు చేరింది. తదనంతరం పలు సందర్భాల్లో మళ్లీ తొమ్మిది కొత్త పంచాయతీలు ఏర్పడగా.. ఇంకా పాలన ప్రారంభం కాలేదు. ఎన్నికలు నిర్వహిస్తే ఇక్కడ కొత్తగా పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లాలో మరిన్ని కొత్త పంచాయతీల ఏర్పాటుకు డిమాండ్ ఊపందుకుంది. జిల్లా ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని కొత్త వాటి ఏర్పాటుకు కృషి చేయాలని ఆయా గ్రామాలు, తండాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



'ఈ చిత్రంలో కనిపిస్తున్న గిరిజనులు రామారెడ్డి మండలం గోకుల్‌తండా-2కు చెందిన వారు. గోకుల్‌తండా-1, 2 కలిపి ఆరేళ్ల క్రితం ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారు. అంతకుముందు ఇవి పోసానిపేట పంచాయతీలో అనుబంధ గ్రామాలుగా ఉండేవి. ఈ రెండు తండాల మధ్య 3 కి.మీ దూరం ఉంది. ప్రతి పనికి గోకుల్‌తండా-1కు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. తమ తండాలో 737 జనాభా ఉందని, ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని గోకుల్‌తండా-2 వారు డిమాండ్ చేస్తున్నారు.'

వీటి ఏర్పాటుకు..

నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్ నుంచి ఎర్రారం, ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల తండా, భిక్కనూరు మండలం జంగంపల్లి నుంచి లక్ష్మీనగర్‌తండా, మద్నూర్ మండలంలో సలాబత్‌పూర్, బీటీపేట అనుబంధ గ్రామంగా ఉన్న రాంరెడ్డిపల్లిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ఉంది.

కారణాలు ఇవే..

కొన్నిచోట్ల కొత్త పంచాయతీల ఏర్పాటుకు జిల్లా పంచాయతీ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మరికొందరు ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. పంచాయతీకి అనుబంధ గ్రామానికి మధ్య దూరం కొత్త వాటి ఏర్పాటు డిమాండ్‌కు ఓ కారణం. దీంతోపాటు పంచాయతీ ఉన్న గ్రామం/తండా అభివృద్ధికి ఎక్కువ నిధులు ఖర్చు చేసి.. అనుబంధ గ్రామాలకు తక్కువ ఖర్చు చేస్తున్నారనేది ప్రజల వాదన. పంచాయతీ ఉన్న ఊరి వారికే పదవులు దక్కే అవకాశం ఉండడంతో.. అనుబంధ పల్లెల వారు అసంతృప్తిగా ఉంటున్నారు.

ప్రత్యేక పంచాయతీల ఏర్పాటుకు గ్రామస్థుల డిమాండ్లు

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం..

కొత్త పంచాయతీల ఏర్పాటుకు దరఖాస్తులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. జిల్లాలో ఇప్పటికే కొత్తగా 9 ఏర్పడ్డాయి. **- శ్రీనివాస్‌రావు, డీపీవో, కామారెడ్డి**



సమావేశానికి హాజరైన రైస్ మిల్లర్లు

48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మిల్లుకు చేరిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన 48 గంటల వ్యవధిలో రైతు ఖాతాలో డబ్బులు జమ చేయాలని తెలిపారు. దొడ్డు, సన్న రకం ధాన్యాలను వేర్వేరుగా నిల్వ చేసుకోవాలని సూచించారు. సీఎంఆర్ బకాయిలు ఇవ్వని మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎం రాజేందర్, రైస్ మిల్లుల సంఘం జిల్లా అధ్యక్షుడు పప్పుల రాజేందర్, కార్యదర్శి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు పక్కాగా నమోదు చేయాలి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కుటుంబ సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయం సీనియర్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలు సంక్షేమ కార్యక్రమాల అమలుపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన గ్రామాల్లో కుటుంబ సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు. ధాన్యం సేకరణ, ఇతర సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో రంగనాథ్‌రావు, పౌరసరఫరాలశాఖ డీఎం రాజేందర్, మున్సిపల్ కమిషనర్ సుజాత, సంక్షేమాధికారి బావయ్య, మార్కెటింగ్ అధికారిణి రమ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ మహిళలు, యువతులు ఆడిపాడారు. జిల్లా కేంద్రంలో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. హౌసింగ్‌బోర్డుకాలనీ, జన్మభూమిరోడ్డు, విద్యానగర్ సాయి నిలయం, వీక్లీమార్కెట్ దుర్గమ్మ ఆలయం, రాంమందిర్, ధర్మశాల తదితర ప్రాంతాల్లో సంబరాలు హోరెత్తాయి.

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



కామారెడ్డిలోని పాత జాతీయ రహదారి సమీపంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

'కామారెడ్డిని అభివృద్ధి చేస్తాం'

భిక్కనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ నాయకత్వంలో కామారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పురపాలక ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తెలిపారు. జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా నియమితులైన చంద్రకాంత్‌రెడ్డిని ఆయన స్వగ్రామం రామేశ్వరపల్లిలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఏళ్లుగా ప్రజా సేవలో ఉన్న చంద్రకాంత్‌రెడ్డికి సరైన గౌరవం దక్కిందని పేర్కొన్నారు. నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, భీంరెడ్డి, శివ, కృష్ణమూర్తి, సలీం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.




చంద్రకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న పుర ఛైర్‌పర్సన్, తదితరులు

పాడి.. లాభాలు దండి
మిత్ర పురుగులతో మేలు
రైతేరాజు
వివరాలు 8లో
ఆరుతడి పైరుగా మొక్కజొన్న...

పాడి.. లాభాలు దండి

న్యూస్‌టుడే, ధర్పల్లి (జక్రాన్‌పల్లి)

పంటల సాగుతో పాటు పాడి కూడా రైతులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది. ప్యాకెట్ పాలు మార్కెట్‌లో లభిస్తున్నా.. నాణ్యమైన గేదె, ఆవు పాలు ఆరోగ్యానికి మంచిది. పల్లెల్లో రోజురోజుకూ తగ్గుతున్న పాడి కొందరు రైతుల పాలిట వరంగా మారింది. ముర్రజాతి గేదెల పెంపకం ద్వారా పాలు, ఇతర ఉత్పత్తులు విక్రయించి ప్రతినెలా అధిక ఆదాయం పొందుతున్నారు పలువురు రైతులు. ఇదే కోవకు చెందిన వారు జక్రాన్‌పల్లి మండలం పుప్పాలపల్లికి చెందిన యువ రైతు తౌడ రవి.


రైతు ఏర్పాటుచేసిన డెయిరీ

ఎనిమిదేళ్ల కిందట ఏర్పాటు..

రైతు రవి 2017లో రూ.15 లక్షలతో 20 ముర్రజాతి గేదెలను తెచ్చి గ్రామంలోని సొంత స్థలంలో డెయిరీని ప్రారంభించారు. మొదట కొన్ని నెలలపాటు ఇబ్బందిగా ఉన్నా నెమ్మదిగా పెంపకంపై అవగాహన పెంచుకున్నారు. ఇద్దరు కూలీలను ఏర్పాటు చేసుకున్నారు. రెండు ఎకరాల్లో సుపారీ నేపియర్ గడ్డిని పెంచి ఏడాది పొడవున గేదెలకు పచ్చిగడ్డి లేని లోటు తీరుస్తున్నారు. అలాగే పత్తి చెక్క, వరి తౌడు, పెసర చున్నీని దాణాగా పెడుతున్నారు. గేదెలు నిత్యం 100 లీటర్ల పాలు ఇస్తుండగా.. నిజామాబాద్ నగరానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఇలా ప్రతినెలా రూ.1.80 లక్షల ఆదాయం వస్తుందని రైతు చెబుతున్నారు. పాడి నిర్వహణ, దాణా, కూలీల ఖర్చులు పోనూ రూ.80 వేల లాభం వస్తుందన్నారు. ప్రతి పంటకాలం సీజన్‌లో పేడ విక్రయం ద్వారా మరో రూ.2 లక్షల పొందుతున్నట్లు చెప్పారు.

స్వయం ఉపాధితో ఆనందంగా ఉంది.

- రవి, పుప్పాలపల్లి



పదో తరగతి పూర్తి చేసిన తర్వాత స్వయం ఉపాధి కోసం పాడిపై దృష్టి పెట్టా. ఏ సీజన్‌లో పశువులకు ఎలాంటి దాణా అవసరం ఉంటుందో తెలుసుకొని అందిస్తున్నా. షెడ్డులో పరిశుభ్రంగా ఉంచితే పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. నిత్యం వినియోగదారులకు నాణ్యమైన పాలను అందించడంలో తృప్తి లభిస్తుంది.

మిత్ర పురుగులతో మేలు

బోధన్ గ్రామీణం: పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను రైతులు కాపాడుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. ప్రధాన పంటలైన వరి, పత్తి పంటల్లో శత్రు పురుగులైన పేనుబంక, పచ్చ, తెల్ల, నల్లదోమలు మిత్ర పురుగులైన అక్షింతల పురుగు, తూనీగలు, తేనెటీగలు, సాలీడు పురుగుల నిష్పత్తి ఆధారంగా మందులు పిచికారీ చేయాలి. మందులు ఎక్కువగా చల్లితే మిత్ర పురుగులు చనిపోతాయి. వీటి వృద్ధికి ప్రధాన పంటల చుట్టూ, లేదంటే అంతరంగా కంది, బంతి, పొద్దుతిరుగుడు సాగు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు.



రైతు ప్రశ్న సమాధానం

వరిలో కంకినల్లి ఆశిస్తుంది. నివారణ తెలుపండి? - లక్ష్మణ్, రైతు, పొతంగల్



పగటి ఉష్ణోగ్రతలు 28-30 డిగ్రీల సెల్సియస్, అధిక తేమ, అధిక ఉష్ణోగ్రతల వల్ల వస్తుంది. ఆకు మధ్య ఈనెపై లేదా ఆకు మట్ట లేదా కాండం మీద గోధుమ నుంచి నల్లటి మచ్చలు ఏర్పడుతాయి. వెన్నులు వంకర తిరగడం, లేదా పాక్షికంగా బయటకిరావడం, గింజ తయారీ దశలో గింజలపై గోధుమ లేదా నల్ల మచ్చలు ఏర్పడుతాయి. నివారణకు స్పైరోమెసిఫెన్ 1.0మి.లీ లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

- విజయ్‌కుమార్, సస్యరక్షణ శాస్త్రవేత్త, రుద్రూర్

– న్యూస్‌టుడే, కోటగిరి

ఆరుతడి పైరుగా మొక్కజొన్న

న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం : యాసంగి పంటకాలంలో కాల్వల కింద, నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న సాగు లాభదాయకమని బోధన్ మండల వ్యవసాయాధికారి సంతోష్ తెలిపారు. మెట్టభూముల్లో బోరుబావుల ఆధారంగా వరి సాగుచేసే రైతులు కూడా మొక్కజొన్న సాగు చేయవచ్చన్నారు. ఆరుతడి సాగులో వరితో సమానంగా ఆదాయాన్ని ఆర్జించొచ్చని అక్టోబర్ 15 నుంచి జనవరి రెండోపక్షం వరకు సాగుచేయవచ్చని వివరించారు.


అనువైన నేలలు: మురుగునీరు నిలువని నల్లరేగడి నేలలు, సారవంతమైన ఎర్ర నేలలు అనుకూలం.

నేల తయారీ: మెత్తగా దుక్కి చేసి, చివరి దుక్కిలో ఎకరానికి పది టన్నుల పశువుల ఎరువు వేస్తే దిగుబడులు పెరుగుతాయి.

విత్తన మోతాదు: ఎకరానికి ఎనిమిది కిలోల విత్తనం అవసరం.

విత్తే విధానం: వరుసల మధ్య 60 నుంచి 75 సెం.మీ, మొక్కల మధ్య 20 నుంచి 30 సెం.మీ (ఎకరానికి సగటున 20వేల నుంచి 30వేల మధ్య మొక్కలు ఉండేలా చూడాలి) బోదె పద్ధతి మంచిది.

ఎరువులు: ఎకరానికి 50కిలోల నత్రజని, 25 కిలోల భాస్వరం, 25కిలోల పొటాష్ వేయాలి.



నత్రజని మూడుభాగాలుగా విభజించి విత్తే సమయంలోనూ, 30రోజుల దశలో, 55రోజుల దశలో ఒక్కో భాగం చొప్పున వేయాలి. సూక్ష్మలోపాలు తలెత్తకుండా ఎకరానికి 10కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలి.

నీటి తడులు: పైరు విత్తిన 15 రోజులకు ఓసారి భూమిలో తేమను బట్టి నీటితడులు ఇవ్వాల్సి ఉంటుంది. నీరుపారించే సమయంలో ఎక్కువ రోజులు నీరు నిల్వకుండా సాగుదారులు జాగ్రత్తలు తీసుకోవాలి.

సస్యరక్షణ: మొవ్వతొలిచే పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ గుళికలను పూతదశకు ముందుగా మొక్కకు నాలుగేసి గుళికల వంతున మొవ్వల్లో వేయాలి.

రామరామ ఉయ్యాలో..
రామనే శ్రీరామ ఉయ్యాలో
నెత్తిమీద సూర్యుడా ఉయ్యాలో
నెలవన్నెకాడ ఉయ్యాలో
పూలతల్లి గౌరమ్మ ఉయ్యాలో
తంగెడుపూల గౌరమ్మ ఉయ్యాలో
ఇలా అమ్మవారిని కీర్తిస్తూ మహిళలు పాటలు పాడుతూ బతుకమ్మ ఉత్సవాల్లో సందడి చేస్తున్నారు.

మదినిండా జానపదమే

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

బతుకమ్మ సందడి అంటే డీజే పాటలు, రకరకాల స్టెప్పులతో వేడుకలు జరుపుకోవడం సాధారణమైపోయింది. కానీ, జానపద పాటలను నోటితో ఆలపిస్తూ సంప్రదాయ బద్ధంగా ఆడుతూ స్ఫూర్తినిస్తున్నారు పలువురు మహిళామణులు. ఏటా ఇదే తరహాలో వేడుకల్లో పాల్గొంటూ ఇతరులను భాగస్వామ్యం చేస్తున్నారు. మరికొందరు విశ్వవిద్యాలయ స్థాయిలో బతుకమ్మ పండగ ప్రత్యేకతపై పరిశోధన చేస్తున్నారు. పలు వేదికలపై వ్యాసాలు సమర్పించారు. ఇలాంటి వారిని ఆలయ కమిటీలు, బృందాల సభ్యులు గౌరవిస్తున్నారు.

పుస్తకంగా తీసుకొస్తా..

శకుంతల, నాందేవ్‌వాడ, నిజామాబాద్

మా సొంతూరు లింగంపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా. వ్యాపార నిమిత్తం ఇందూరుకు వచ్చాం. మా అమ్మ భూమవ్వ, అత్తమ్మ లక్ష్మిల ద్వారా 25 బతుకమ్మ పాటలు నేర్చుకున్నా. అక్కమ్మ, గౌరమ్మ, బతుకమ్మ వీడ్కోలు పాటలు పాడడం ఇష్టం. నాందేవ్‌వాడ, కిషన్‌గంజ్‌లో జరిగే వేడుకలకు నన్ను ఆహ్వానిస్తారు. నా పాటలను త్వరలో పుస్తకంగా తీసుకొస్తా.


మహిళలతో కలిసి పాటలు పాడుతున్న శకుంతల

పాటలోని అర్థం తెలుసుకోవాలి

- తోట నవీన, బోర్గాం(పీ), నిజామాబాద్



మాది అంక్సాపూర్. అమ్మ గంగుబాయి ద్వారా పాటలు నేర్చుకున్నా. 35 ఏళ్లుగా అమ్మవారి పాటలు పాడుతున్నా. సద్దుల బతుకమ్మ రోజు తప్పకుండా ఇంటికొకరు బతుకమ్మ సంబరంలో పాల్గొంటారు. కుటుంబ బంధాలు, ఆత్మీయత, గౌరమ్మ గొప్పతనం చాటుతూ పాటలు పాడుతుంటా. పాటల్లో ఎంతో అర్థం దాగి ఉంటుంది. అది తెలుసుకుని ఆలపిస్తా.

పరిశోధన చేశా..

- శారదా హన్మాండ్లు, ఉపాధ్యాయిని, వడ్డెపల్లి జడ్పీ స్కూల్

ప్రభుత్వ ఉపాధ్యాయినిగా ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్నప్పుడే అక్కడి బతుకమ్మ వేడుకల్లో మహిళలు పాడే పాటలు తెలుసుకున్నా. వీటిపై విశ్వ విద్యాలయాల స్థాయిలో పరిశోధన చేయాలని భావించా. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో తిరిగి వందకు పైగా పాటలు సేకరించా. తెలంగాణ విశ్వవిద్యాలయం నుంచి 2018లో బతుకమ్మ సాంస్కృతిక పునరుజ్జీవనం అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకోవడం సంతోషంగా అనిపిస్తుంది.


వడ్డెపల్లి పాఠశాల చిన్నారులతో శారదా హన్మాండ్లు



అయోధ్య మందిరం.. అలంకరణ అద్భుతం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ఏర్పాటుచేసిన దేవీ మాత మండపాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. నిర్వాహకులు నిత్యం ఆలోచనలకు పదును పెడుతూ మండపాలను ముస్తాబుచేస్తున్నారు. నిజామాబాద్ వినాయకనగర్‌లోని తొలి మహిళా మేయర్ వీధిలోని అయోధ్య రామాలయం ఆకారంలో విద్యుత్తు దీపాలతో రూపొందించిన మండపం చూపరులకు కనువిందు చేస్తోంది.

– ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

తడిసిన సోయా

బిచ్కుంద గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పుల్కల్, పెద్దదేవాడ గ్రామాల్లో సోమవారం కురిసిన వర్షానికి రైతులు ఆరబెట్టిన సోయా పంట తడిసింది. టార్పాలిన్ల కిందకు నీరు చేరడంతో అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. త్వరితగతిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


పుల్కల్‌లో సోయాపై టార్పాలిన్ కప్పుతున్న రైతులు

భాజపా సభ్యత్వ నమోదు

మద్నూర్, న్యూస్‌టుడే: మద్నూర్‌లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సోమవారం పాత బస్టాండ్ వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వం నమోదు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షురాలు అరుణతార పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మండల అధ్యక్షుడు తుకారాం, నాయకులు ఉన్నారు.


పాల్గొన్న అరుణతార తదితరులు

బతుకమ్మ పాటల పుస్తకావిష్కరణ



కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్‌లో భాగ్యలత రచించిన బతుకమ్మ పాటల పుస్తకాన్ని సోమవారం 15వ వార్డు కౌన్సిలర్ వనిత ఆవిష్కరించారు. నాయకులు రామ్మోహన్, ప్రతినిధులు నిర్మలామోహన్ తదితరులున్నారు.

పోటీలు లేకుండానే ఎంపికలు

- అంతర పాఠశాలల క్రీడల నిర్వహణ తీరిది

న్యూస్‌టుడే, బాన్సువాడ

ఉమ్మడి జిల్లాలోని చాలా మండలాల్లో అంతర పాఠశాలల క్రీడలు నిర్వహించకుండానే ఎంపికలు పూర్తి చేశారు. జోన్, జిల్లా స్థాయికి ఎంపికలు పూర్తి చేసి క్రీడలను మమ అనిపించారు. దీంతో ప్రతిభ ఉన్న కొంతమంది గ్రామీణ క్రీడాకారులకు అన్యాయం జరిగిందనే వాదన ఉంది. ఏటా నిర్వహించాల్సిన అంతర పాఠశాలల క్రీడలను ముందుకొచ్చిన మండలాల్లోనే నిర్వహించి మిగతా మండలాల్లో పట్టించుకోవడం లేదు.


బాన్సువాడలో పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ఇలా చేయాలి..

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అంతర పాఠశాల క్రీడలు నిర్వహించాలి. మండలస్థాయిలో ఎంపిక చేసిన అనంతరం మూడు, నాలుగు మండలాలకు కలిపి జోన్‌స్థాయిలో పోటీలు జరిపి జిల్లాస్థాయికి ఎంపిక చేయాలి. అనంతరం ఉమ్మడి నిజామాబాద్ స్థాయికి ఎంపిక చేసి అక్కడి నుంచి రాష్ట్రస్థాయి అక్కడ ప్రతిభ చాటితే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జాతీయస్థాయి క్రీడా పోటీలు జరిగే తేదీలకు అనుగుణంగా మండల, జోన్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించాలి. ఈ విషయంపై ఎస్‌జీఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ.. 'జిల్లాలో మండల, జోన్‌స్థాయి క్రీడాకారుల ఎంపిక పూర్తి చేశాం. ముందుకువచ్చిన మండలాల్లో అంతర పాఠశాలల క్రీడలు నిర్వహించాం. మిగతా చోట్ల వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలు నిర్వహించి ఎంపిక చేశారు. తర్వాత సైతం మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించుకోవచ్చు' అని తెలిపారు.

ఎనిమిది మండలాల్లోనే..

ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది మండలాల్లోనే క్రీడలు నిర్వహించారు. అందులో కామారెడ్డి జిల్లాలో గాంధారి, నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్ అర్బన్, గ్రామీణం, ఆలూర్, భీమ్‌గల్, సిరికొండ, బాల్కొండ, నవీపేట మండలాలు ఉన్నాయి. మిగతా మండలాల్లో నిర్వహించకుండానే క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లాస్థాయి పోటీలకు పంపించారు. ఫలితంగా ప్రతిభ ఉన్న కొంత మంది గ్రామీణ క్రీడాకారులకు అన్యాయం జరిగినట్లు తెలుస్తోంది.


రిబ్బన్‌ను కత్తిరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నగల దుకాణం ప్రారంభం

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో సీఎంఆర్ జ్యువెలరీ షోరూంను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సోమవారం ప్రారంభించారు. నగర మేయర్ నీతూకిరణ్ జ్యోతి వెలిగించారు. 46వ డివిజన్ కార్పొరేటర్ అక్బర్ హుస్సేన్ హాజరయ్యారు. సీఎంఆర్ గ్రూప్ ఫౌండర్, ఛైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో అతిపెద్ద బంగారు ఆభరణాల షోరూం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.

గోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మారయ్యగౌడ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని నీరాకేఫ్‌లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో నిర్వహించిన గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లాకు చెందిన ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ మారయ్యగౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లాలోని గౌడ్ యువజన సంఘ సభ్యులతో పాటు పలువురు ఆయనను అభినందించారు.



దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులను ఎంపిక చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ/ఎస్టీ కమ్యూనిటీకి చెందిన ఐదుగురు నాన్ అఫీషియల్ సభ్యుల ఎంపికకు, ఇతర వర్గాల నుంచి ఎన్జీవోలతో అనుబంధం కలిగిన ముగ్గురు సభ్యుల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నామని పేర్కొన్నారు. సభ్యులకు ఎలాంటి నేర రికార్డు ఉండకూడదని, డిగ్రీ విద్యార్హత ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం చేసిన సేవా నేపథ్యాన్ని దరఖాస్తుల్లో పొందుపర్చాలని కోరారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం వరకు కలెక్టరేట్‌లోని గది నంబరు 113లో దరఖాస్తులు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

☛ నిందితుల నుంచి సొత్తు రికవరీ

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండ మండలం సంగమేశ్వర్‌కు చెందిన గంప సత్తయ్య తన ఇంట్లో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయన తన భార్యతో కలిసి శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని ఓ శుభకార్యానికి వెళ్లారు. ఆదివారం తిరిగివచ్చి చూసేసరికి కిరాణా దుకాణం, ఇంట్లోని నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఆంజనేయులు దర్యాప్తు ప్రారంభించారు. బాధితుడి ఇంటి పక్కన అనుమానితులుగా భావించిన ఒకరి ఇంట్లో సోదా చేయగా.. చిల్లర నాణేలు దొరికాయి. విచారణలో పక్కన ఇంటికి బంధువులుగా వచ్చిన ముత్యంపేట వాసి గరుగుల భరత్, కొండయ్యల రాజవ్వలు రూ.22,500 నగదు దొంగతనం చేసినట్లు ఒప్పుకొన్నారని ఎస్సై తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి.. రూ.18 వేలు స్వాధీనం చేసుకొని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

ఏషియన్ ప్రియా సినీప్లెక్స్ | ఈనాడు సినిమాలు

సత్యం సుందరం	11.00 2.20 6.00 9.20
రాంనగర్ బన్నీ	11.20 6.20
దక్షిణ	2.20 9.20

వీ సినిమాస్

దేవర	10.50 2.15 5.50 9.30

ఏషియన్ దర్పన్

స్వాగ్	11.00 2.00 6.00 9.00

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242



జిల్లా కేంద్రంలోని పీహెచ్ కాలనీలో దీపం వెలగడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. - **చంద్రశేఖర్, పీహెచ్‌కాలనీ**

ఫిర్యాదు మేరకు దీపం ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. - **సుజాత, కమిషనర్**



జిల్లా కేంద్రంలోని సైలన్‌బాబాకాలనీలో కాల్వ పక్కన గడ్డి పెరిగింది. ఇరు వైపులా గడ్డిని తొలగించాలి. - **కిరణ్, సైలన్‌బాబాకాలనీ**

కాల్వకి ఇరువైపులా గడ్డి తొలగించేందుకు చర్యలు చేపట్టాం. పారిశుద్ధ్య సమస్య లేకుండా శ్రద్ధ చూపాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



జిల్లా కేంద్రంలోని ఆర్‌బీనగర్‌లో మురుగు కాల్వలో పూడిక పేరుకుపోయింది. అధికారులు చర్యలు తీసుకోవాలి. - **రాజు, ఆర్‌బీనగర్**

కాల్వలో నిండిన పూడికను తొలగించాం. పారిశుద్ధ్య స్థితిని మెరుగు పరిచాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

గ్రామంలో దోమలు ఎక్కువగా ఉన్నాయి. దోమల వ్యాప్తిని తగ్గించాలి - **నర్సింలు, లింగుపల్లి, మం.దోమకొండ**

దోమల నివారణకు చర్యలు చేపడతాం - **స్నేహ, గ్రామ కార్యదర్శి, లింగుపల్లి**



పాత బాన్సువాడ సంగమేశ్వరకాలనీలో మురుగు కాల్వలు చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. - **ప్రవీణ్, బాన్సువాడ**

ఈ విషయాన్ని పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య పరిష్కరింపజేశారు.

బిచ్కుంద గడి కింది వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు కూలి రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నాం. **సాయిలు, బిచ్కుంద.**

కల్వర్టును పరిశీలించి కొత్త కల్వర్టు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటాం.. **శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి, బిచ్కుంద**

మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద తాగు నీటిపైపు లైను పగిలి నీరు వృథాగా పారుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. **సంగమేశ్వర్, స్థానికుడు**

పంచాయతీ సిబ్బందికి చెప్పి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం. **శ్రీనివాస్, కార్యదర్శి**

తుంకిపల్లి గేటు సమీపంలోని విద్యుత్తు స్తంభానికి చెట్ల తీగలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారింది. - **నరేష్, తుంకిపల్లి గ్రామస్థుడు.**

వెంటనే తీగలను తొలగిస్తాం. -**శ్రీనివాస్, లైన్‌మెన్, తుంకిపల్లి.**

పిట్లం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో వర్షం కురిస్తే చాలు మురుగుకాల్వలో నీరు రోడ్డు మీదకు చేరుతోంది. **సామెల్, స్థానికుడు**

స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు చేపడుతాం. **యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం**

- **న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం, దోమకొండ,బాన్సువాడ పట్టణం, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, మహ్మద్‌నగర్, పిట్లం**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి

గాంధారి: ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్తు ఉప కేంద్రంలో సోమవారం 'విద్యుత్తు వినియోగదారుల ఫిర్యాదులపై సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించారు. డీఈ విజయ్ సారథి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీజీఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్ నారాయణ, సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్‌లు హాజరై గాంధారి, సర్వాపూర్, లింగంపేట్ కేంద్రాల పరిధిలోని 14 మంది వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు శంకర్‌రావు, రావుసాహెబ్‌రావు, మాధవరావు పాల్గొన్నారు.

మున్సిపల్ ఛైర్మన్‌కు సన్మానం

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి నూతన మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికైన పద్మ శ్రీకాంత్‌ను సోమవారం పతంజలి యోగా సమితి సభ్యులు సన్మానించారు. నాగరాజుగౌడ్, శ్రీకాంత్, మారుతీరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న సభ్యులు

పరిశీలించి.. పరిష్కారానికి ఆదేశించి

● ప్రజావాణిలో వినతుల వెల్లువ

న్యూస్‌టుడే,కామారెడ్డి కలెక్టరేట్

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిశీలించాలని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయాశాఖల అధికారులు వారికి సంబంధించిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 82 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూశాఖకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. ఈ సందర్భంగా కొందరు బాధితులు న్యూస్‌టుడేకు వారి గోడు చెప్పుకున్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

సగమే రుణమాఫీ జరిగింది

- రాంచంద్‌నాయక్, హాజిపూర్(ఎల్లారెడ్డి)

నేను గత ఏడాది డిసెంబరు 8న వాణిజ్య బ్యాంకులో రూ.90వేల రుణం తీసుకున్నాను. ముందుగా నాకు డిసెంబరు 8 వ తేదీన రూ.40 వేలు , 29న రూ.50వేలు ఇచ్చారు. ముందుగా తీసుకున్న రూ.40వేలు మాత్రమే మాఫీ అయింది. మొత్తం రుణాన్ని ఒకసారే తీసుకున్నాను. బ్యాంకు వారు చేసిన పొరపాటుకు నాకు పూర్తి రుణమాఫీ కాలేదు

పట్టాపాస్ పుస్తకం లేదంటున్నారు

- ధాత్రిక నాగయ్య, పెద్దమల్లారెడ్డి(భిక్కనూరు)

నాకు గ్రామంలో 3.15 ఎకరాల పట్టా భూమి ఉంది. రేషన్ కార్డు, పట్టా పాస్ పుస్తకాలు, మీ-సేవా పహాణీ తదితర ధ్రువపత్రాలు ఉన్నాయి. సాగు నిమిత్తం నేను 2022లో రూ.1.63 లక్షల బ్యాంకు రుణం తీసుకున్నాను. కానీ నాకు పట్టా పాస్ పుస్తకం లేదనే కారణంతో రుణం మాఫీ చేయలేదు. పాస్ పుస్తకం చూపించినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

సాగు భూములు లాక్కోవద్దు



మేము దేశాయిపేట, దుర్కి, సోమేశ్వర్, బాన్సువాడ గ్రామాలకు చెందిన రైతులం. కొత్తగా నిర్మిస్తున్న 765డీ జాతీయ రహదారి నిర్మాణం కోసం మా సాగు భూములు తీసుకుంటున్నారు. ఎకరాకు కేవలం రూ.10లక్షల పరిహారం ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. పాత రోడ్డు ప్రకారం జాతీయ రహదారిని నిర్మిస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. అలా కాకుండా కొత్త ప్రతిపాదనతో సాగు భూములు తీసుకుంటున్నారు. ఎకరా రూ.2కోట్లు విలువ చేసే భూములను రూ.10లక్షలకు ఎలా వదులుకుంటాం.

వేతనాల కోసం ధర్నా



పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ మాట్లాడారు. కార్మికులకు 6 నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఆనంద్‌గౌడ్

'భాజపాతోనే బీసీలకు రాజ్యాధికారం'

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: భాజపాతోనే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి భాజపా కృషి చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించాలన్నారు. రాష్ట్ర నాయకులు రంజిత్ మోహన్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాలరాజు, బల్దియా ఫ్లోర్‌లీడర్ మోటూరి శ్రీకాంత్, పట్టణాధ్యక్షుడు భరత్, నాయకులు లక్ష్మీపతి, రాజలింగం తదితరులున్నారు.

అందుబాటులోకి తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖచిత్రం పుస్తకం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖచిత్రం-2024 పుస్తకం అందుబాటులో ఉందని సీపీవో రాజారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన వారు కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో రూ. 150 చెల్లించి పుస్తకం పొందవచ్చని పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మాచారెడ్డి, న్యూస్‌టుడే: మాచారెడ్డి గ్రామంలో ఎంఆర్పీఎస్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్పుగొండ విజయ్, ఉపాధ్యక్షులుగా సురేశ్, వినయ్, ప్రధాన కార్యదర్శిగా రాము, కోశాధికారిగా లింగం, గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మణ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రమేశ్, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాములు, మండల ప్రధాన కార్యదర్శి హరీశ్, రవి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నాపూర్(రామారెడ్డి), న్యూస్‌టుడే: రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామాభివృద్ధి కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా భరత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా లింగం, కోశాధికారిగా యాదగిరి, కార్యదర్శిగా శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా రవీందర్‌రావు, అంజల్‌రెడ్డి, బోయ లింగం, లక్ష్మీనారాయణ, మధు, ఆశోక్, ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. గ్రామస్థులు లింగం తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ నేడు

బాన్సువాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని కల్కి చెరువులో మంగళవారం చేప పిల్లల వితరణ చేయనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు. జిల్లా ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.



విత్తన బస్తాను అందజేస్తున్న ఛైర్మన్ శివానంద్

రైతు శ్రేయస్సే లక్ష్యం

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: రైతు శ్రేయస్సే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మండల నాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు రాంచందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దసరా తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని రైతులు అధైర్యపడొద్దని చెప్పారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, తాండూరు సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి, ప్రధానకార్యదర్శి కిష్టయ్య, సంజీవులు, నర్సింహారెడ్డి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతలు అధైర్య పడొద్దు

జుక్కల్, న్యూస్‌టుడే: యాసంగిలో సెనగ సాగు చేసే రైతులు విత్తనాల కోసం అధైర్య పడొద్దని, సహకార సంఘంలో నిల్వలు ఉన్నాయని ఛైర్మన్ శివానంద్ అన్నారు. సోమవారం రైతులకు సెనగ విత్తనాలు పంపిణీ చేశారు. 25 కిలోల బస్తా ధర రూ. 2250 ఉందని, కావాల్సిన వారు సంఘానికి వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. వెంట కార్యదర్శి బాబురావు, రఘునాథ్, జావీద్ తదితరులు ఉన్నారు.

ఆటపాటలు... ఆత్మీయ పలకరింపులు



బిచ్కుందలో...



కామారెడ్డి అశోక్‌నగర్‌లో



బాన్సువాడ : మాతాశిశు సంరక్షణ ఆసుపత్రిలో.



చుక్కాపూర్‌లో ..

గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ మహిళలు ఆడిపాడారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న ఆడపడచులు ఆటపాటలు.. ఆత్మీయ పలకరింపులతో సందడి చేశారు. . **న్యూస్‌టుడే, బృందం**



ఖద్గాంలో ...



ఎర్రపహాడ్‌లో ..



చుక్కాపూర్‌లో

క్రికెట్ పోటీలు ప్రారంభం

రామారెడ్డి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆజాద్ క్రికెట్ ఛాంపియన్ ట్రోఫీని సోమవారం ఎస్సై నరేష్ ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీల్లో ఆరు జట్లు పోటీపడుతున్నాయని అధ్యక్షుడు గుర్జకుంట స్వామి తెలిపారు. మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5వేలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి సంజీవ్, రాజేశ్వర్, సందీప్, మహిపాల్, బండి ప్రవీణ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



టాస్ వేస్తున్న ఎస్సై నరేష్

ప్రసాద దుకాణం వేలం

మాచారెడ్డి, న్యూస్‌టుడే: మాచారెడ్డి మండలం చుక్కాపూర్ లక్ష్మీ నర్సింహుడి ఆలయంలో రెండేళ్లపాటు లడ్డూ, పులిహోర ప్రసాదాలు తయారు చేసి విక్రయించడానికి దేవాదాయ శాఖ పరిశీలకులు సుమన్ ఆధ్వర్యంలో సోమవారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన నర్సింగరావు రూ.17,21,000లకు దుకాణం దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, సురేందర్, లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు



ఎల్లారెడ్డి : దుర్గామాత సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పూజలు



ఉప్పల్‌వాయిలో..



కోమలంచలో ..



సదాశివనగర్ : ఉత్తునూరులో



మాందాపూర్‌లో

జిల్లా వ్యాప్తంగా సోమవారం దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు, మండపాల వద్ద జరిగిన సామూహిక కుంకుమార్చనల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వివిధ అలంకారాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. - **న్యూస్‌టుడే, బృందం**



గాంధారిలో ..



బ్రహ్మాజివాడిలో..



లలితత్రిపుర సుందరిగా చాముండేశ్వరీదేవి



పిట్లంలో ..



బాన్సువాడ సరస్వతిదేవీ ఆలయంలో



బీర్కూర్ పోచమ్మ ఆలయం వద్ద..



లింగంపేటలో...



కామారెడ్డి హౌసింగ్‌బోర్డుకాలనీలో



భిక్కనూరు: జంగంపల్లిలో



కామారెడ్డిలో శారదాంబ ఆలయంలో



పాత బాన్సువాడలో...



నాగిరెడ్డిపేట్ : కిచ్చన్నపేట్‌లో ..



నేలకొరిగిన వరి

బీర్కూర్, నస్రుల్లాబాద్.: బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో సోమవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పలు గ్రామాల్లో గాలులకు వరి నేలకొరిగింది. చేతికొచ్చిన పంట నేలరాలడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు.

డీఈకి వినతి

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని 5వ వార్డు గండిమాసానిపేటలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం డీఈ విజయసారథికి వినతి పత్రం అందించారు.

ధాన్యం శుద్ధి యంత్రాలు ప్రారంభం

నాగిరెడ్డిపేట్: తరుగు పేరుతో రైతులను మోసగించడం ఇక జరగదని తాండూరు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రెండు ధాన్యం శుద్ధి యంత్రాలకు పూజలు చేసి ఆయన ప్రారంభించారు. ఉపాధ్యక్షుడు బాబురావు, డైరెక్టర్లు, రైతులు రాజదాస్, సంజీవులు, ప్రభాకర్, బాబు, శివకుమార్, మధు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువతి మృతి

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: గుండెపోటుతో వారం కిందట తాత.. తాజాగా మనుమరాలు మృతిచెందిన ఘటన సంగెం గ్రామంలో చోటుచేసుకుంది. బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన డేగావత్ బీనా (21) నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానాలో నర్సుగా పని చేసేవారు. పదిరోజుల కిందట జ్వరం బారిన పడ్డ బీనాను తల్లిదండ్రులు మహారాష్ట్ర ఆసుపత్రిలో చేర్పించారు. ఇటీవల బీనా తాత తార్యానాయక్ గుండెపోటుతో మృతిచెందడంతో ఆమె స్వగ్రామానికి వచ్చారు. కార్యక్రమాలు పూర్తి చేసుకుని తిరిగి మూడు రోజుల కిందట నిజామాబాద్ వెళ్లారు. ఆదివారం సదరు యువతి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు ఆమెను నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానాలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతుండగా అర్ధరాత్రి సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందారు. వారం వ్యవధిలో తాత, మనవరాలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



డేగావత్ బీనా

కుటుంబ కలహాలతో ఒకరి బలవన్మరణం

బీబీనగర్, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్కుందకు చెందిన జీరిగే సునీల్‌కుమార్(34) బీబీనగర్‌లో స్థిరపడి కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్న సునీల్‌కుమార్ ఆదివారం ఇందిరమ్మకాలనీలోని తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి అన్న సంజీవ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

పెద్దకొడప్‌గల్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసి ఎత్తుకెళ్ళిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామానికి చెందిన నాగరాజు ఆదివారం పెద్దకొడప్‌గల్‌లోని ఓ ఎరువుల దుకాణదారుడి వద్దకు వచ్చాడు. చీకటి పడటంతో ఆ రాత్రి ఎరువుల దుకాణం ఎదుట ద్విచక్ర వాహనాన్ని నిలిపి పై అంతస్తులో పడుకున్నాడు. పొద్దున లేచి చూసే సరికి బండి కనిపించ లేదు. దీంతో ఆందోళన చెందిన నాగరాజు డయల్ 100కి ఫోన్ చేసి స్థానికంగా ఉన్న ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విద్యుత్తు సిబ్బందిపై దాడి

మాచారెడ్డి, న్యూస్‌టుడే: విద్యుత్తు సిబ్బందిపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన పల్వంచ మండలం ఇసాయిపేటలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. విద్యుత్తు సిబ్బంది కథనం ప్రకారం.. ఇసాయిపేట విద్యుత్తు ఉప కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కొండారెడ్డి రాత్రి 11.45 గంటల సమయంలో లైను మార్చారు. ఆ సమయంలో కరెంట్ ఎందుకుపోయి వచ్చిందని గ్రామానికి చెందిన కుర్మ సంతోష్ మద్యం మత్తులో ఉప కేంద్రంలోకి చొరబడి కర్రతో తనపై దాడికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.



చికిత్స పొందుతున్న విద్యుత్తు అధికారి కొండారెడ్డి